

# టెల్గా సినేమా

— వి. ఆర్. గణపతి

"ఒహ సినిమా కథ చెప్పరా నాయనా! నీ కెంతో పుణ్యముంటుంది! ఒచ్చే జన్మలో నీ కలంగా పుడతాన్రా బాబూ!" అంటూ తింటోన్న టిఫిన్ని తిన్నీయకండా, తాగుతోన్న కాఫీని తాగనీకండా, ఏవీ ఆలోచించనీయకండా, ఏవీ చేయనీకుండా ఉదయంనించీ నన్నొహాటే బోరెత్తిస్తోన్న శర్మగాడి గొడవ

భరించలేక "ఒరేయ్ నాయనా! వాల్మీకీ! నా ప్రాణాన్ని యిలా తీయకగానీ,పద! అలా కాలవొడ్డుని కూర్చుందాం పద! నీ పీడ వదుల్చుకుంటా" అన్నాను కాసింత విసుగ్గా!

వాడు రాకెట్టెక్కినంత పన్జేసి, "ఒరేయ్! థాంక్యూరా! పదరా! నీ పాదాలు కందిపోకుండా, నిన్ను ఎత్తుకెడతా నక్కడికే!" అంటూ పద్మనాభం పోజుపెట్టేసరికి, వాడు నిజంగా అన్నంతపనీ చేసేట్టుగా వున్నాడని గ్రహించి "పదరా నా చిట్టినాన్నా" అంటూ నడిచేను.

ఇద్దరమూ కూర్చున్నాము, ఆ కాలవ అనబడే చిన్న ప్రవాహ సౌందర్యాన్నవలోకిస్తూ, నేను కథ మొదలెట్టబోతూ శర్మగాడికి ఓ షరతుపెట్టేను, "ఒరేయ్! నేన్చెప్ప బోయేది. సిన్మాకథ! అందులోనూ సాక్షాత్తూ మన తెలుగు సిన్మాకథ! గనక మధ్య మధ్యన అనుమానాలూ, ప్రశ్నలూ వేయటం, నా ప్రాణాల్తీయటం పనికిరాదు. అల్లెట్లా? ఇల్లెట్లా అంటూ చొప్పదంటు ప్రశ్నలేస్తే, గూబ్బగల గొడతాన్జాగర్త! ఓకే?" అన్నాను. శర్మగాడు తలని అడ్డంగా గబగబా వూపి, "ఓకేరా!" అన్నాడు.

* *

అనగనగా ఓ హీరో! పేరు మధువో, రాజువో ఏదో వొహటి! అతనేమో! పాపం మరీనూ, కాలేజీలో చదూకుంటున్నాడు.'పాలెట్లా వుంటాయిరా నాయనా?'అనడిగితే, 'తెల్లగానండీ!'అంటాడు. అల్లాంటి మహా మంచివాడు. వాళ్ళదేమోనూ పాపం, చాలా పేద కుటుంబం! వాళ్ళ ఫాదర్ని డైరెక్టరూ,రైటరూ బలవంతంగా వీడి ఉన్నప్పుడే చంపేశేరు! వాళ్ళ అమ్మేమో అందరి యిళ్ళలోనూ గిన్నెలూ గట్రా తోమీ, మిషన్లు కుట్టీ సంపాయించి, ఆ డబ్బుల్తో మన హీరోని చదివిస్తోంది. మన హీరోనేమో, పాపం అడప్రేక్షకుల కళ్ళలోంచి వరదలు కట్టేలాగా, మగ ప్రేక్షకులంతా ప్చ్! ప్చ్! అనేలాగా పొడ్యూసరు కొనిచ్చిన రిక్షానో, లాగుడు బండీనో లాగుతూంటాడు రాత్రిపూట!

ఓనాడూ ఓ చక్కని కళ్ళ అందాల చుక్క. అందమైన శరీరం, (అందమంటే లావేనా?) మాటిమాటికీ జారే సన్నని సిల్కు చీరా వగైరా, వగైరా హంగులన్నీ వున్న అమ్మాయి, అదే! మన హీరోయిన్, సిన్మా చూసి, ఇంటికెళదామనుకొనేసరికి ఆవిడకి ఒక్కటాక్సీ అన్నా కన్పించదు! అయితే అక్కడే వో మూలకి రిక్షాలో ముడుచుకు పడుకునివున్న మన హీరో కన్పిస్తాడు. వెంటనే రిక్షా దగ్గిరకి అత్యంత వయ్యా

రంగా వెళ్ళి, "ఏయ్ రిక్షా" అంటూ అందంగా నోరుతెరిచి పిలిచి, వాడెంతకీ లేవకపోవటంతో తన చేత్తో వాణ్ణి కుదిపి, తనూ కదిలి, కెమెరాకి బాగా పని యిచ్చి హీరోని లేపేస్తుంది। అతను లేచి, ఆ అమ్మాయిని చూసీచూడకండానే, టక్కున కెమెరాకేసి తిరిగి మరీ గతుక్కుమని, నాలిక్కరుచుకుని, తలపైవున్న క్యాప్‌ని కళ్ళమీదకి లాక్కుని, తాను రిక్షా ఎక్కి ఆ అమ్మాయిని ఎక్కించుకుని యింటి దగ్గర దింపుతాడు.

అక్కడ ఆ అమ్మాయి, ఈ అబ్బాయిని తన కాలేజీలో తన క్లాస్‌మేటుగా గుర్తించేసి, కళ్ళనీళ్ల పెట్టేసుకుంది. హీరోకూడా గ్లిసరిన్ కళ్ళకి పులుముకుని ముక్కు చీదేస్తాడు। అదిరా। శర్మా। హీరో హీరోయిన్ల పరిచయం।।" అంటూ చెప్పడం ఆపి వూపిరి పీల్చుకున్నాను.

శర్మ మహా జోరుగా వింటున్నాడు కథని. "ఊ। చెప్పరా। పతీ। బ్రహ్మాండంగా వుంది నీ కథ।" అన్నాడు మూసుకున్న కళ్ళని తెరుచుకుని.

"మరో రోజున మన హీరోయిన్ని విలనొహడు వెంటబడి ఏడిపించ సాగేడు. హీరోయిన్ గబగబా నడుస్తూ మాటిమాటికీ వెనక్కి తిరిగి చూస్తూ, స్పీడుని హెచ్చిస్తూ పరిగెడుతోంది. ఏ పనీ లేకండా ట్రిమ్ముగా తయారయి ఎదురుగ్గా వస్తున్న హీరోని దఢాలున దాపిచ్చేపింది హీరోయిను। ఇద్దరూ క్రిందపడ్డారు. హీరోయిన్ పయిట ఎక్కడుంటుందో మీకు తెలుసు। వెంటనే హీరోయిన్ సరుకుని విలన్‌ని చూయించింది హీరోకి. ఇహ చూడు నా సామిరంగా। విలన్ని చిత్తుచిత్తుగా చేసి పారేసి హీరోయిన్ని యింటికి తీసికెళ్ళి వదిలివొచ్చేడు.

తర్వాత సీను. కాలేజి స్టూడెంట్లంతా ఎక్స్‌కర్షన్‌కని నాగార్జున సాగరో, మహాబలిపురమో, వల్లకాదో.... వెడతారు। అందులో మన హీరో, హీరోయినూ వున్నారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు।

అంతలో టక్కున శర్మ ఏదో అడిగేడు, 'హీరో మరీ పేదవాడూ అన్నావుగదా। వాడెట్లా వెళ్ళగలిగేడు ఎక్స్‌కర్షన్‌కీ.' అని. నాకొళ్లు మండింది. 'ఆ బస్సేమోనూ వాళ్ళ తాతది। అందుకని। వెధవప్రశ్నలూ వెధవ అవతారమూను। ముందే చెప్పేను. ఇది తెల్గు సిన్మా కథరా నాన్నా, దీంట్లో అనుమానాలే రాకూడదురా భడవా' అని।

"ఐయాం సారీరా। ఊ, తర్వాత ...."అంటూ చిన్న మొఖం పెట్టుకున్నాడు శర్మ।

"తర్వాతేమోనూ।.... బస్సు

అగగానే హీరోహీరోయిన్లని కెమె రాకి వదిలి, మిగతావాళ్ళు దూరంగా వెళ్ళిపొయ్యేరు. ఇహ డ్యూయట్టు! మాంచిగుమ్మగా ఓపాట! హీరో హీరోయిన్లు నానా చేష్టలు చేస్తూ- ఓ చరణం నాగార్జున సాగర్లో, ఓ చరణం చార్మినార్ మీదా,మరోలైను బృందావన్ గార్డెన్స్ లో, ఆ తర్వాతది కాశ్మీర్ లో- నానా తంటాలూ పడి ఎలాగోలా పాటని పూర్తిచేస్తే అంతదాకా ఎర్రగా ఎండకాస్తున్న దల్లా డైరెక్టరు మహిమ వల్ల దడదడా వురుములు, మెరుపులు (పగటిపూట) కమ్ముకుంటాయ్! ఉరుము శబ్దానికి భయపడి హీరోయిను హీరోని చుట్టుకు పోవటం మామూలు దృశ్యమేననుకో! అయితే డైరెక్టరు వీళ్ళకి దగ్గిరగా ఏ చెట్టూ, పుట్టా లేకండా ముందుగానే జాగ్రత్త పడటంవల్ల వీళ్ళిద్దరూ పరిగెత్తుతూ జడివానలో తడిసి ముద్దయి డైరెక్టరు వీళ్ళిద్దరికీ చూపించిన పాడుబడ్డ దేవాలయం చేరుకున్నారు. తడిసి ముద్దయ్యింది హీరోయిన్, అసలే వుల్లిపొరలాటి చీర, జాకెట్టు తడిసి శరీరానికతుక్కుపొయ్యి మహాఘోరంగా వున్నా. మన ఖర్మానికి కెమెరా ఆవిడ తలనించి కాళ్ళదాకా నాలుగైదుసార్లు పైకీ కిందికి కదిపి, మరీ ముఖ్యమైన చోట్లలో ఒక్కో నిముషం చొప్పున ఆగుతూ నానా చేష్టలూ చేస్తూ వుంటుంది, హీరో హీరోయిన్లు, మెల్లిమెల్లిగా ఒకర్నొకరు చూసుకుంటూ దగ్గిరగా చేరతారు. అలాగే కూలబడతారిద్దరూను. కెమెరా ఆకాశంలోకి! హాలులో ఈలలు, కేకలూ!!

ఇహ వాళ్ళ చేష్టలకి అంతూ పొంతూ వుండదు. హీరోయిన్ అందచందాల్ని బాగా ఎక్స్పోజ్ చేయడానికని ఓపల్లెటూరి పొలంలో పాట! హీరో ఎప్పుడూ కొడవలి పట్టుకున్న పాపాన పోక పోయినా దాన్ని అడ్డంగా పట్టుకుని, ఓ నలభై యాభై మందిలో ద్వంద్వార్ధాల పాట పాడతాడు!!

ఇహ, ఇంతటితో కథని ఆపేస్తే ఎలా? హీరోయిన్ ఫాదర్ బారెడు మీసాలూ గట్రా కలిగి, వీళ్ళమధ్యకి దూకుతాడు, వీళ్ళని యిన్ని చేష్టలు చేయనిచ్చి, గెంతులు గెంతనిచ్చి, డైరెక్టరు బలంగా తోసేయటంతో వీళ్ళమధ్యకి వచ్చి ఇహ హీరోని తెగ కేకలేస్తాడు! 'నువ్వెంత? నీ తాహతెంత!' వంటి పాత డైలాగులే నాల్గయిదు వల్లించి, గెంటేస్తాడింట్లోంచి. అందాకా హీరోతో తైతక్కలాడిన హీరోయిను అప్పుడు అచ్చు భారతీయ స్త్రీగా మారి తండ్రి మాటకి ఎదురు చెప్పలేక 'ఊ.....'అని కుమిలిపోతుంది. అక్కడ మనహీరో, ఇక్కడమన హీరోయినూ కురిపించిన కన్నీటితో